తీసి అందులో బుక్సు పెట్టుకొని బయటకు వచ్చింది.

ఆరోజు తండ్రికి బదులు అప్పలసూరి రిక్షా తీసుకొని వచ్చాడు. అప్పుడప్పుడు దాన్నయ్యకు బదులు అతని కొడుకు రిక్షా తేవడం పరిపాటే.

''సెవులపిల్లి ఎంట్రికల్లా అవుపడిందేట మ్మాయి గోరూ తవరి సంచీ?'' అన్నాడు అప్పలసూరి ప్రసూన షోల్డరు బేగు చూసి ఎంతో ఆశ్చర్యంగా.

''దీన్ని ఫర్‌క్లాత్ అంటారు! దీంతో కుక్కపిల్ల, పిల్లి, కోతి వంటి బొమ్మలు చేస్తారు'' అంది ప్రసూన రిక్షాలో కూర్చుంటూ.

''కానండి సంచి సూపరుగుందండి! శానా బాగుంది!''

''అవునా! నీకు అంతగా నచ్చిందా! అయితే యిందా తీసుకో!'' అని సంచిలో పుస్తకాలు బయటకు తీసి సంచి అప్పలసూరి కందించింది ప్రసూన.

వాడు సంచీ తీసుకునేందుకు జంకేడు.

''ఫర్వాలేదు నేను నీకు దీన్ని కానుకగా యిస్తున్నా తీసుకో!'' అని బలవంతంగా యిచ్చింది.

అప్పలసూరి ఆనందానికి అంతేలేదు. దానిని తన మరదలు మల్లికి కానుకగా యిస్తే 'ఎర్రిబాగుల్ది ఎంత సంబరపడిపోతాదో?' అనుకున్నాడు.

ఆ సాయంత్రం అప్పలసూరి పరుగుపరుగున మల్లివద్దకు వెళ్లి- ''మల్లీ నీకోసం ఏటి దెచ్చినానో సూడు!'' అంటూ సంచీ మల్లికివ్వబోయేడు.

బావ చేతిలో సంచీ చూసి మల్లి ''కెవ్వ్''మంది.

**-రావి.ఎన్.అవధాని (విజయనగరం)**

# రైలు ప్రయాణం

**నాకు రైలంటే ఇష్టం. రైలు ప్రయాణం అంటే చచ్చేంత ఇష్టం. ఈ మాటలు ఏ చిన్నపిల్లాడో అనడం ఆశ్చర్యం కాదు. కానీ నాలాంటి అరవయ్యేళ్ల ముసలాడు అంటే ఆశ్చర్యంగానే ఉంటుంది.**

నాకెందుకో చిన్నప్పటినుంచీ రైలంటే ఇష్టం. అప్పట్లో ఇంటిపక్కనే రైలు పట్టాలుండేవి. రైలు కూత వినిపించగానే అన్నం తింటున్నా సరే బయటకు పరుగెత్తుకెళ్లి రైల్లో వాళ్లకి చేతులూపేవాడిని, వాళ్ల అదృష్టానికి అసూయపడుతూ. వేసవిసెలవుల్లో అందరూ అమ్మమ్మల ఇళ్ళకి రైలు మీద వెళ్లి వారి అనుభూతులు కళ్లింత చేసుకుని చెబుతుంటే నా మనసులోని కోరికకి ఆజ్యం పోసినట్టనిపించింది. మా అమ్మా, నాన్నలు కులాంతర వివాహం చేసుకున్నారు. అందువల్ల మా ఇంటికి బంధువుల రాకపోకలేం వుండేవి కావు. అలాగే మేమూ వాళ్ళెవరిళ్లకి వెళ్ళేవాళ్లం కాదు.



నేను పెద్దయి ఉద్యోగంలో చేరాక అయినా నా కోరిక తీరుతుందనుకున్నాను. కానీ ప్రైవేట్ ఉద్యోగం కావడంతో ఎల్.టి.సి తప్పనిసరిగా ఉపయోగించాల్సిన అవసరమేం ఉండేది కాదు. ఆ డబ్బు సంవత్సరానికోసారి ఇచ్చేసేవాళ్ళు. ఉద్యోగరీత్యా నాకు టూర్లు కూడా ఏం వుండేవికావు.

ఉన్న ఇద్దరు కూతుళ్లకి ఊళ్ళో సంబంధాలే వచ్చాయి. కనీసం నా ఇద్దరు కొడుకులు మరో ఊళ్ళో వున్నా రైల్లో వెళ్లి చూసొస్తుండేవాడిని కానీ వాళ్ల విమాన ప్రయాణమంత దూరంలో ఉంటున్నారు. పోనీ నేనైనా అలా తిరుపతో, శ్రీశైలమో రైలు మీద వెళదామనుకుంటే. భార్య లేకుండా ఒంటరిగా ప్రయాణం చేస్తే ఏం బావుంటుంది. కూతుళ్లనీ, అల్లుళ్లనీ రమ్మంటే ఒక్కొక్కళ్ళు ఒక్కో కారణం చెప్పి వాయిదా వేస్తున్నారు. అలా రైలు ప్రయాణం నాకో తీరని కోరికయిపోయింది.

అందుకే కనీసం మనసుకి కాస్త ఊరటగా ఉంటుందని రోజూ ప్లాట్‌ఫాం టికెట్ తీసుకుని కాస్సేపు రైళ్లని చూడడమనే వ్యాపకం పెట్టుకున్నాను. కొంతలో కొంత తృప్తి.

అప్పుడే రైలొచ్చింది. ప్లాట్‌ఫాం అంతా హడావిడి పుంజుకుంది. గడబిడగా మాటలు... గజిబిజిగా మనుషుల కదలికలు... అమ్మకందార్ల అరుపులతో తెగ కోలాహలంగా ఉంది.

కొద్దిసేపయ్యాక అందులోంచి అందరూ దిగిపోయారు. రైలంతా ఖాళీ అయిపోయింది. నామనసులో ఏదో వెలితి. పాపం ఇందాకటిదాకా అందర్నీ తన కడుపులో దాచుకుంది. వాళ్ల కేరింతలు చూసి సంతోషంగా కూతేసుకుంటూ ఇక్కడికొచ్చింది. పాపం అందరూ దాన్నొదిలి వెళ్లిపోతున్నారు. ఇంతమందిలో కనీసం ఒక్కరన్నా దాని గురించి ఆలోచిస్తారా? నాకెందుకో దానిదీ నాదీ ఒకటే జీవితం అనిపించింది. మొన్న మొన్నటి దాకా ఎన్నెన్నో బాధ్యతలతో ఎంతో బిజీగా ఉన్నాను. ఇప్పుడు ఎవరూ లేని ఏకాకిగా మిగిలిపోయాను. పదేళ్లక్రితమే నా భార్య పైలోకానికి వెళ్లిపోయింది. పిల్లలు రెక్కలొచ్చిన పక్షులై తలోదిక్కుకి వెళ్లిపోయారు. ఎవరి బంధాలు వాళ్లవి. నేనెవ్వరికీ గుర్తు రానా? నా కళ్లలో అప్రయత్నంగా నీళ్ళు నిండాయి.

అంతలో ''నాన్నగారూ, మేము వస్తున్నామని మీకెలా తెలుసు? స్టేషన్ కొచ్చారు?'' అని వినిపించి పక్కకి చూశాను. నా ఇద్దరు కొడుకులు వాళ్ల పెళ్లాం పిల్లలతో నవ్వుతూ నుంచున్నారు. అప్పటి దాకా డల్‌గా ఉన్న నా మనసులో మళ్లీ సంతోషం.

''నీ మనవళ్లకి నిన్ను చూడాలని ఒకటే కోరిక. పైగా మన రైళ్లంటే చాలా ఇష్టం. అదేంట్రా అంటే, రైల్లో వెళుతుంటే చిన్న చిన్న స్టేషన్లు రావడం. రైల్లో అమ్ముకునేవాళ్ళు, పాటలు పాడుతూ అడుక్కునేవాళ్ళు, రైల్లోని హడావిడి... అంతా వీళ్లకి ఇష్టంట. ప్రాణం తీసేస్తున్నారు. అందుకే ఈసారి లాంగ్‌లీవ్ తీసుకుని వీళ్లని మీతో కలిసి మన స్టేట్‌లోని టూరిస్ట్ స్పాట్స్ అన్నీ తిప్పాలనుకుంటున్నాం. రిజర్వేషన్ చేయించేశాము. రేపటినుంచే మన ప్రయాణం'' అన్నాడు మా పెద్దబ్బాయి.

నా ఆనందం అంతా ఇంతా కాదు. పిల్లల్తో రైలు ప్రయాణం ఓ చక్కటి అనుభూతి. నా కోరిక ఇన్నాళ్లకి తీరబోతోంది. నా మనవళ్లకి నా కోరికే కలగడం యాదృచ్ఛికమే అయినా, నా కోరిక తీరడానికి అదెంతో ఉపకరిస్తోంది. ఆనందబాష్పాలతో వాళ్లని దగ్గరికి తీసుకున్నాను.

నాకెందుకో ఇందాకట్నించి నిరుత్సాహంగా ఉన్న రైలు నవ్వుతున్నట్టనిపిస్తోంది. ఎందుకంటే మాతో రేపటి ప్రయాణానికి సిద్ధమవుతోందిగా.

**-ప్రతాప వెంకటసుబ్బారాయుడు (సికింద్రాబాద్)**